
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

గురువారం 24 జూలై 2025

క్యాన్సర్ బాధితులకు కలెక్టర్ ఆర్థిక సహాయం

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇద్దరు క్యాన్సర్ బాధితులకు వైద్యం కోసం బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన నిరంక స్వప్న(లత), కోనరావుపేట మండలం వట్టిమల్ల పరిధి అజ్మీరా తండాకు చెందిన అజ్మీరా కళ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో వైద్యం కోసం ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరడంతో స్పందించి అందజేశారు. కోనరావుపేట మండలం అజ్మీరా తండాకు చెందిన అజ్మీరా కళకు రూ.లక్ష, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన నిరంక స్వప్న(లత)కు రూ 75వేల చెక్కులను అందజేశారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి లక్ష్యం వైపు ప్రయాణించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో బుధవారం మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నమోదు అవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న కస్తుర్బాగాంధీ విద్యాలయాలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ ఇతర ఉన్నత విద్యాసంస్థల వద్ద డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో డీఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటుచేసి అవసరమైన వారికి చికిత్సలు అందించాలని సూచించారు. అటవీశాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలను ప్రతినెలా తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు, యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వ్యాస, రచన, డ్రాయింగ్ పోటీలు చేపట్టి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, జిల్లా కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టే గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం గ్రామ పాలన అధికారుల నియామక పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే గ్రామ పరిపాల అధికారి పరీక్షకు జిల్లాలోని 39మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. వీరికి సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ అధికారి నోడల్ అధికారిగా ఈ పరీక్షలు చేపడుతారని తెలిపారు. పరీక్షా కేంద్రానికి సెల్‌ఫోన్, చేతిగడియారాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసిన తర్వాత అభ్యర్థుల జావాబు పత్రాలను సీజ్ చేసి ఎస్కార్ట్‌తో జేఎన్టీయూ కన్వీనర్‌కు పంపించాలన్నారు. పరీక్ష కేంద్రంలో ప్రతి బెంచ్‌కు ఒక అభ్యర్థి ఉండేలా చూడాలన్నారు. నిర్ణీత సమయం ముగిసిన తర్వాత అభ్యర్థులను లోపలికి అనుమతించవద్దని ఆదేశించారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యాలయం ఆవరణంలో శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో ప్రతి అరగంటలకు అభ్యర్థులకు సమయం తెలిపేందుకు అల్లారం మోగాలని పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ దుకాణాలను మూసివేయించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, సెస్ఎండి రామసుబ్బారెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖాదీర్‌పాషా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లోకిని శారద పాల్గొన్నారు.

పత్తిరైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్నందున పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోవు మూడు రోజులపాటు వర్షాలు ఉన్నందున పత్తిచేనులో నీరు నిలిచే అవకాశం ఉందన్నారు. చేనులో చిన్నచిన్న కాలువలు ఏర్పాటు చేసి నీరు బయటకు వెళ్లేలా చూడాలన్నారు. పత్తిపంట వడలిపోయినట్లు కనిపిస్తే వేర్ల మొదల్లో కార్బన్డిజం, మాన్కోజాబ్ అనే మందును పోయాలన్నారు. అధిక తేమశాతం ఉండటం వల్ల మొక్కలు భూమినుండి పోషకాలు గ్రహించలేనందున నానో యూరియా వేయాలని సూచించారు.



వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- పత్తిచేలకు ఊపిరి.. జోరందుకున్న వరినాట్లు
- వానాకాలం సాగు అంచనా 2.43 లక్షల ఎకరాలు
- ఈ సీజన్‌లో కురిసిన వర్షం 248.1 మిల్లీమీటర్లు
- జిల్లాలో ఆరు మండలాల్లో లోటు వర్షపాతమే..

జూలై 23వ తేదీ వరకు జిల్లాలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది
రుద్రంగి	324.1	114.3
చందుర్తి	339.1	239.7
వేములవాడ రూరల్	314.9	251.1
బోయినపల్లి	276.2	200.7
వేములవాడ	319.9	262.9
సిరిసిల్ల	309.6	214.8
కోనరావుపేట	273.8	296.9
వీర్నపల్లి	288.2	231.7
ఎల్లారెడ్డిపేట	283.9	232.6
గంభీరావుపేట	278.4	272.2
ముస్తాబాద్	247.1	268.7
తంగళ్లపల్లి	311.8	330.0
ఇల్లంతకుంట	325.3	280.0
సగటు వర్షపాతం	292.5	248.1

జిల్లాలో ఇప్పటివరకు వానాకాలం సాగు ఇలా..

మండలం	వరి	పత్తి	మొత్తం
గంభీరావుపేట	8,500	110	8,623
ఇల్లంతకుంట	19,500	12,000	32,470
ముస్తాబాద్	16,000	400	16,605
సిరిసిల్ల	3,000	650	3,656
తంగళ్లపల్లి	10,000	870	10,953
వీర్నపల్లి	7,000	300	7,300
ఎల్లారెడ్డిపేట	11,000	2,500	13,500
బోయినపల్లి	4,800	6,400	11,280
చందుర్తి	9,800	6,100	15,922
కోనరావుపేట	14,000	3,200	17,200
రుద్రంగి	5,910	2,190	1,01,194
వేములవాడ	3,800	4,600	8,438
వేములవాడ రూరల్	8,000	4,000	12,039
మొత్తం	1,21,310	43,320	1,68,180

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు అన్నదాతల్లో ఆశలు పెంచాయి. జూన్ మాసంలో వరుణుడు ముఖం చాటేశాడు. జూలై మొదటి వారంలో ముసురు నుంచి మోస్తరు వర్షాలు కురియడంతో సాగు పనులు మొదలుపెట్టారు. మళ్లీ వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతుండగా, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మళ్లీ పంటలకు ఊపిరినిచ్చాయి.

దీంతో అన్నదాతలు సంతోషంగా సాగు పనుల్లో బిజీగా మారి పోయారు. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలో 30.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ముస్తాబాద్‌లో 70.9 మిల్లీమీటర్లు, గంభీ రావుపేటలో 49.8, ఇల్లంతకుంటలో 43.7, బోయి న్‌పల్లిలో 41.1, వేములవాడలో 35.4, తంగళ్ళపల్లి 33.6, వేములవాడ రూరల్‌లో 26.7, ఎల్లారెడ్డిపేటలో 20.9, చందుర్తిలో 18.8, సిరిసిల్లలో 17.4, కోనరావుపేటలో 15.1, వీర్నపల్లిలో 14.4, రుద్రంగిలో 4.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ప్రస్తుత సీజన్లో జూన్, జూలైలో సాధారణ వర్షపాతం 292.5 మిల్లీమీటర్లు ఉండగా, నమోదైన వర్షపాతం 248.1 మిల్లీమీటర్లు ఉంది. జిల్లాలో ఇప్పటివరకు ఆరు మండలాల్లో లోటు వర్షపాతం ఉంది.

ఇందులో రుద్రంగి, చందుర్తి, వేములవాడ రూరల్, బోయిన్‌పల్లి, సిరిసిల్ల, కోన రావుపేట మండలాలు ఉండగా సాధారణ వర్ష పాతంలో ఎనిమిది మండలాలు ఉన్నాయి. ఇందులో వేములవాడ, కోనరావుపేట, ఎల్లారెడ్డి పేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట, మండలాలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటికీ 15.0 శాతం లోటు వర్షపాతంగా ఉంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతోంది. జిల్లాలోని ప్రధానమైన శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి మూల వాగు, మానేరు వాగుల నుంచి నుంచి 210 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టులో ఇప్పటివరకు 27.55 టీఎంసీ ల సామర్థ్యానికి 6.84 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ఎగువ మానేరు ప్రాజెక్టులో 0.63 టీఎంసీలు,

మిగతా 8వ పేజీలో

అవార్డు గ్రహీతలకు సన్మానం

గంభీరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహానంది అవార్డు గ్రహీతలకు బుధవారం సన్మానం చేశారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన సంతోష్‌చారీ, నర్మాలకు చెందిన బొంగు మల్లేశంలు హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో మహానంది అవార్డులను మల్లేశం, సంతోష్ చారీలు అందుకున్నారు. ఈ క్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇద్దరికి శాలువాలతో సత్కరించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మాజీ సర్పంచ్ భూమరాజం, నాయకులు లక్ష్మీనారాయణ, బాలకిషన్, బంగ్ల రాజు, భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

అడవుల్లోకి ఒంటరిగా వెళ్లవద్దు.

వీర్నపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి అటవీ సమీప ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అనుమానంతో అడవుల్లోకి ఒంటరిగా పశువులను మేతకు తీసుకెళ్లద్దని అటవీ శాఖ అధికారులు సూచించారు. మండలంలోని పలు అటవీ ప్రాంతాల్లో పశువుల కాపరులకు అటవీశాఖ సెక్షన్ అధికారులు రంజిత్‌కుమార్, సకారం బుధవారం అవగాహన కల్పించారు. వీరివెంట బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా బస్తీ దవాఖాన

- కిటికీల అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం..
- మితిమీరిన మందుబాబుల ఆగడాలు..
- పట్టించుకోని అధికారులు

8

'మహాలక్ష్మి' మహిళలకు ఎంతో ఉపయోగం

- మూడు కోట్ల ఉచిత బస్ టికెట్లపై ప్రయాణాలు
- రూ.110 కోట్లు ఆదా..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

8

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట

- 200 కోట్ల మంది ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాలు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



విద్యార్థులను సన్మానించి బహుమతులు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మరో మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో బుధవారం ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సంబరాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను, విద్యార్థులను ఆది శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలో సమయంలో ఇచ్చిన హామీమేరకు అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే కాంగ్రెస్ సర్కార్ 2023 డిసెంబరు 9వ తేదిన మహాలక్ష్మీ పథకం పేరుతో మహిళల కోసం ఉచిత ఆర్టీసీ బస్సు ప్రారంభించిందన్నారు. 18 నెలల్లోనే రికార్డు స్థాయిలో 200 కోట్ల మంది ప్రయాణించారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో చాలా వరకు మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మిగిలిన డబ్బులను ఆదా చేసుకుని వాటి ద్వారా చిట్టీలు వేస్తున్నామని మహిళలు చెప్పడం ప్రజా ప్రభుత్వానికి గర్వకారణమన్నారు. వేములవాడ డిపో పరిధిలో 6 మండలాలో మహిళ ప్రయాణికులు సుమారుగా కోటి 55 లక్షల మంది ప్రయాణం చేశారని తద్వారా రూ.57 కోట్ల 66లక్షలు ఆదా చేసుకున్నారని తెలిపారు.

మహిళలకు రూ. 500కే ఉచిత సిలిండర్, గృహ జ్యోతి పథకం కింద రూ. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపట్టడం జరుగుతందని, గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామని వివరించారు. ఆనాడు ఆర్టీసీ సంస్థ సంక్షోభంలో ఉండేదని కానీ ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసీ డిపోల్లో ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయని తెలిపారు. బస్సు ప్రయాణాలు జరగడం వలన చిరు వ్యాపారులకు, కిరాణా దుకాణదారులకు మేలు జరుగుతుందని సూచించారు. ఇప్పటికైనా కేటీఆర్, హరీష్‌రావు ఉచిత బస్సు ప్రయాణాలను స్వాగతించాలని హితవు పలికారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి మూడు రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తొలినాళ్లలో మహిళలను అవమానపరిచేలా మాట్లాడినా కేటీఆర్, హరీష్‌రావు వారిని చులకనగా చూస్తూ మాట్లాడారని గుర్తుచేశారు. ఇప్పటికైనా మహిళలకు క్షమాపణ చెప్పాలని. ఈ పథకం దిగ్విజయంగా కొనసాగడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలపాలని సూచించారు. తిప్పాపూర్ నుంచి రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా పనులు జరుగుతున్నాయని, భూనిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి తిప్పాపూర్ బస్టాండ్‌కు నూతన శోభ సంతరించుకునేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించారని, మహిళలకు వడ్డీలేని రుణాలు మంజూరుచేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సంకల్పించారన్నారు. వేములవాడ పట్టణంలో మహిళాశక్తి ఆధ్వర్యంలో ఎరువు దుకాణం ప్రారంభించిన సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో తల్లులకు పెద్దపీఠ వేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శాషాద్రినిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సీఐ వీరప్రసాద్, డిపో మేనేజర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, జులై 23 (ఆంధ్రజ్యోతి): యుఎస్‌పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తంగళ్లపల్లి మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ అధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ విద్యా, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 25ను సవరించాలని, 60 మంది విద్యార్థులు దాటితేనే ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధనను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయులు బదిలీలు, ప్రమోషన్లు వెలంటనే నిర్వహించాలని అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, పదవీ విరమణ పొందిన వారికి వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 30 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్, అశోక్, పర్కాల రవీందర్, బండి ఉపేందర్, పోకల కిరణ్, కొక్కుల బాలరాజు, సుధీర్‌కుమార్, జక్కని శ్రీనివాస్, మధుసూదన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎండీలో చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి


మృతి చెందిన సయ్యద్ రిజ్వాన్, సర్వర్

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీలో బుధవారం చేపల వేటకువెళ్లి ఇద్దరు మృతిచెందారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సాలేనగర్‌కు చెందిన సయ్యద్ సర్వర్(55) తన తమ్ముడి కుమారుడైన సయ్యద్ రిజ్వాన్(20)తోపాటు మహమ్మద్ ఇసాక్ (33) మండలంలోని లోయర్‌మానేర్ డ్యాం(ఎల్ఎండీ)లో చేపలవేటకు ఉదయం10గంటలకు వెళ్లారు. చేపలుపట్టే సమయంలో సయ్యద్ రిజ్వాన్(20) ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన రిజ్వాన్ పెద్దనాన్న సయ్యద్ సర్వర్(55) కాపాడేందుకు పోయి అతడితోపాటు నీటిలో మునిగి పోయాడు. అక్కడే ఉన్న మరోవ్యక్తి ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సమా చారం తెలుసుకున్న తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాం త్‌గౌడ్, నీటిమునిగిన వారి కుటుంబ సభ్యులు వెంటనే సంఘటన స్థలానికిచేరుకొని వలల సహాయంతో నీటిలో మునినిగిపోయిన ఇద్దరిని వెలికితీశారు. అప్పటికేఇద్దరు మృతిచెందారు. మృతదే హాలను కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్ట్

● పది ద్విచక్రవాహనాలు స్వాధీనం
● కొనుగోలు చేసిన వారిపై కేసు


దొంగను, స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ మొగిలి

తంగళ్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా వరుసగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న దొంగలను తంగళ్లపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో దొంగల అరెస్ట్ చూపిన అనంతరం రూరల్ సీఐ మొగిలి మాట్లడారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఆడెపు రవి కుమార్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్నాడన్నారు. బుధవారం చోరీకి పాల్పడిన ఆడెపు రవికుమార్‌తోపాటు బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరోవ్యక్తి పరారయ్యాడని పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తులు ఏడు నెలలుగా తంగళ్లపల్లి మండలంతో పాటు, ముస్తాబాద్, సిరిసిల్ల, వేములవాడ, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో పది ద్విచక్ర వాహనాలు చోరీ చేశారని, దొంగతనం చేసిన ద్విచక్ర వాహనాలను చందుర్తి, కరీంనగర్, సిరిసిల్లలో తక్కువ ధరకు విక్రయించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేసి పది వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దర్యాప్తు వేగవంతంగా చేసి చాకచక్యంగా దొంగలను పట్టుకున్న తంగళ్లపల్లి ఎస్ఐ ఉపేంద్రచారిని, హెడ్ కానిస్టేబుళ్లు సుధాకర్, బాలనర్సయ్యలతోపాటు కానిస్టేబుళ్లు నరేందర్, రామ్మోహన్, వికాస్‌లను సీఐ అభినందించారు.

నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

● 106 నకిలీ సర్టిఫికెట్లు.. కంప్యూటర్.. ప్రింటర్ స్వాధీనం

కోరుట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అదర్శనగర్ ప్రాంతానికి చెందినవ్యక్తి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్టు కోరుట్ల సీఐ సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరుట్లలోని ఆదర్శనగర్‌కు చెందిన రుద్ర వేణుగోపాల్ పట్టణంలోని పోచమ్మ వీధిలో ఆన్‌లైన్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఫొటోషాప్‌ద్వారా నకిలీ సర్టిఫికెట్లు, ఎస్సెసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెమోలు, నకిలీడెత్ సర్టిఫికెట్లు తయారు చేసి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీసీఎస్ పోలీసులతో పాటు స్థానికపోలీసులు ఆన్‌లైన్ కేంద్రంపై దాడి చేసినట్లు సీఐ తెలిపారు. ఆన్‌లైన్ కేంద్రంలో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కేంద్రంలో నిల్వఉన్న 106 నకిలీ సర్టిఫికెట్లు(పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, డెత్ సర్టిఫికెట్లను) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్, ప్రింటర్, పేపర్ కటింగ్, లామినేషన్ మిషన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. రుద్ర వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల సీఐ సురేష్ బాబు, కోరుట్ల ఎస్ఐ చిరంజీవి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాజు, సీసీఎస్ కానిస్టేబుల్స్‌ను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.



గ్రామీణ మహిళలకు వరం.. నమో డ్రోన్ దీదీ

• డిజిటల్ వ్యవసాయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకం
• మహిళ సంఘాలకు ఉపాధి అవకాశం

చొప్పదండి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ వ్యవసాయంలో భాగంగా గ్రామీణ మహిళల ఉపాధి కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకాన్ని తీసుకువచ్చింది. వ్యవసాయ ఆధారిత ఉపాధేమార్గంగా మహిళలు జీవితాల్లో మార్పు తేవడంతో పాటు ఆధునిక సాంకేతికతను రైతులకు చేరవేడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈపథకాన్ని తీసుకువచ్చింది. మహిళా సాధికారిత, వ్యవసాయంలో ఆధునికత, నైపుణ్య అభివృద్ధితోపాటు గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి డ్రోన్ దీదీ నూతన అవకాశాలను కల్పిస్తున్నది. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభు త్వం అమలు చేస్తుండగా ఆసక్తిఉన్న మహిళా సంఘాలు దరఖాస్తు చేసుకోవాలి.

● డ్రోన్ సేవలు..

సబ్సిడీపై అందే డ్రోన్లతో ఎస్‌హెచ్‌సీ గ్రూపులు వ్యవసాయంలో రైతులకు సహాయకారిగా పనిచేస్తాయి. ప్రతియేటా కనీసం లక్ష రూపాయల ఆదాయాన్ని పొందుతాయి. పంట పొలాలపై ఎరువులు, పురుగు మందుల పిచికారితోపాటు పంట సర్వేలు, మ్యాపింగ్, డేటా అనాలసిస్ లాంటి పనులను డ్రోన్‌ద్వారా సంఘాల సభ్యులు నిర్వహిస్తారు. వ్యవసాయాధారిత డ్రోన్‌ద్వారా సంఘాలకు ఆదాయంతోపాటు మహిళల జీవితాల్లో మార్పును తీసుకువస్తాయి. ప్రస్తుతం పంట పొలాలకు ఎరువులు, పురుగుమందుల పిచికారి కోసం రైతులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఎకరానికి 300నుంచి 500రూపాయల వరకు డ్రోన్ ఆపరేటర్లు చార్జి చేస్తున్నారు. డ్రోన్ మహిళా సంఘాలకు ఆదాయం తెచ్చిపెట్టనుంది. స్వయం సహాయక గ్రూపులు నమోడ్రోన్ దీదీ కోసం వ్యవసాయ శాఖ లేదా కృషి విజ్ఞాన కేంద్రాలను సంప్రదించాల్సి ఉంటుంది. లేదా ఠీఠీఠీ.ఱఒజీఱ్మజుట్ప.ఛీఠి.జౌఠి.జీ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు.

● నమో డ్రోన్ దీదీ లాభాలు..



దేశవ్యాప్తంగా 15వేల మహిళాగ్రూపులకు డ్రోన్లను అందించనుంది. ప్రతిడ్రోన్ కొనుగోలుపై కేంద్రప్రభుత్వం 80శాతం సబ్సిడీని అందజేస్తుంది. గరిష్టంగా 8లక్షల వరకు డ్రోన్ కొనుగోలుపై సబ్సిడీ అందుతుంది. మిగతా డబ్బులను అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా 3శాతం వడ్డీపై రుణాన్ని అందజేస్తారు. పథకానికి ఎంపికైన సంఘ సభ్యులకు డ్రోన్ నడిపేందుకు సరైన శిక్షణ అందిస్తారు. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో డ్రోన్‌ను సంఘాలకు అందజేస్తారు. డ్రోన్ శిక్షణ కోర్సును డీజీసీఏ అంగీకరిస్తుంది. రైతులకు డ్రోన్‌ద్వారా సేవలందిం చేందుకు వ్యవసాయశాఖ మహిళాసంఘాలకు మద్దతునిస్తోంది. ఎంపవర్, నాఫెడ్, ఇఫ్కోతోపాటు కస్టమ్ హైరింగ్ సెంటర్స్ (సీహెచ్‌సీ)ల భాగస్వామ్యంతో పనిచేస్తాయి. డ్రోన్ తయారీదారులు, శిక్షణసంస్థలు, వ్యవసాయశాఖ కూడా సంఘాలకు సహకారాన్ని అందిస్తాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

● ఒకరి మృతి ● మరో నలుగురికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామంలోని టోల్‌గేట్ సమీపంలో రోడ్డుకు పక్కన ఆగిఉన్న లారీని వెనకనుంచి కారుఢీకొంది. ఈ సంఘటనలో ఒకరు మృతిచెందగా, కారుడ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన లంగరు లోకేష్ తన మిత్రుడైన మన్నె రాఘవ(22)ను తీసుకొని హైదరాబాద్‌లో ఓకారును అద్దెకు తీసుకొన్నారు. అతనికి పరిచయిస్తురాలైన స్నేహ, ఆమెతోపాటు ఆమె తల్లి దండ్రులైన రాజేష్,లక్ష్మితో కలిసి కరీంనగర్‌లోని గంగాధరకు బయలుదేరారు. లోకేష్ కారు నడుపుతుండగా అతని పక్క సీట్లో రాఘవ కూర్చున్నాడు. వారు ప్రయాణిస్తున్న కారు తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలోని టోల్ గేట్ సమీపంలో రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చున్న మన్నె రాఘవతోపాటు వెనకాల కూర్చొన్న మొర్కురి స్నేహ, మొర్కురి రాజేష్, మొర్కురి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అక్కడే ఉన్న టోల్‌గేట్ అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్లు పరీక్షించి మన్నె రాఘవ మృతి చెందినట్లు తెలిపారు. మిగతా వారిలో మొర్కురి స్నేహ, రాజేష్, లక్ష్మి తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా, డ్రైవర్ లోకేష్‌కు స్వల్ప గాయలయ్యాయి. మృతిచెందిన మన్నే రాఘవ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ లోకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

కువైట్‌లో గుండెపోటుతో ఖాసింపేట వాసి మృతి


సాగర్(ఫైల్)

గన్నేరువరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట గ్రామానికిచెందిన బత్తుల సాగర్(42) బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లి అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. మూడేళ్లక్రితం జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ రెండు నెలల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. మళ్లీ ఇటీవలే కువైట్‌కు తిరిగి వెళ్లాడు. శనివారం అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు సాగర్ స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. మృతుడికి భార్య సరవ్వ, కూతురు ఉండగా కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహం కోసం కుటుంబసభ్యులు, బంధువులు ఎదురుచూస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ కమాన్ వద్ద రోడ్డుపై పడిఉన్న వ్యక్తిని 108 అంబులెన్స్ సిబ్బంది కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా అదే రోజు అర్ధరాత్రి 11 గంటలకు మృతి చెందాడు. మృతుడు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యేముందు తనపేరు అక్తర్ మహ్మద్ పాషా, బృందావన్‌కాలనీగా చెప్పినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలు తెలియరావడంలేదని, గుర్తించిన వారువెంటనే ప్రభుత్వాస్పత్రిలోని అవుట్ పోస్ట్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

● మరో ఐదుగురికి జరిమానా

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని నడిపిన ఆరుగురు వ్యక్తులకు జరిమానా విధిస్తూ గోదావరిఖని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు తెలిపారు. మద్యం సేవించి 2వసారి పట్టుబడిన ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష, మరోఐదుగురికి రూ.10వేలజరిమానా విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో లేగ దూడ మృతి

చందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్కల దాడిలో లేగ దూడ‌పై మృతిచెందగా, మరో దూడ గాయపడింది. ఈ సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కటుకం మల్లికార్జున్, కటకం వేణు అనే రైతులకు చెందిన లేగ దూడలపై పిచ్చి కుక్కలు బుధవారం తెల్లవారుజామున దాడి చేయడంతో ఓ లేగ దూడ మృతి చెందగా, మరో లెగదూడ తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతోంది. దూడ మృతి చెందడంతో రైతుకు సుమారు రూ.16వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. గ్రామంలో కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గంభీరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామశివారులో పేకాటఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్టు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. నాగంపేట గ్రామ సమీపాన పేకాట ఆడుతున్నట్టు ఆడిన సమాచారం మేరకు గాలించగా ముగ్గురు పేకాట ఆడుతూ కనిపించారని పేర్కొన్నారు. వారిని పట్టుకొని, వారి నుంచి రూ.11,500, 3బైకులు, 2 సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

కోనరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి కోనరావుపేట తహసీల్దార్ వరలక్ష్మి జరిమానా విధించారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికిచెందిన చకినాల నర్సవ్వ గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కానీ మళ్లీ నాటుసారా విక్రయిస్తూ బైండవర్ నిబంధనలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఆమెను అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.25వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలరాంపూర్ గ్రామానికి చెందిన గూడ రవి హత్య కేసులో నిందితుడైన గూడ గంగాధర్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల9న భూ తగాదాలో గంగాధర్‌వరసకు సోదరుడైన రవిని పారతో విచక్షణారహితంగా కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. రవిని మెరుగైనచికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించారు. రవి భార్య రజిత ఫిర్యాదు మేరకు అత్యాయత్నం కేసు నమోదు చేశారు. గూడ రవి చికిత్సపొందుతూ ఈనెల 21న మరణించాడు. దీంతో రవిపై మెటపల్లి సీఐ అనిల్‌కుమార్ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తుచేశారు. నిందితుడుగూడ గంగాధర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

ముత్తారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో కాల్వశ్రీరాంపూర్‌మండలం ఇదిలాపూర్ గ్రామానికి చెందిన సదానందం అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గోదావరిఖని ఇన్‌చార్జి ఏసీపీ మల్లా రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ

● బంగారు అభరణాలు, వెండి, నగదు అపహరణ


పోరండ్లలో విచారిస్తున్న పోలీసులు

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లి సంఘటన మండలంలోని పోరండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోరండ్ల గ్రామంలో తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలో దొంగతనం జరిగింది. చందనం సుగుణ తన భర్త గతనెల క్రితం మరణించగా ఇల్లు వదిలిపెట్టి పోరండ్ల గ్రామంలోనే మరోఇంట్లో అద్దెకు ఉంటోంది. ప్రతిరోజు తన సొంత ఇంటికి వస్తూ పోతూ ఉన్నారు. రోజూ లాగే బుధవారం కూడా ఇంటికి వెళ్లిన సుగుణ కుమారుడికి ఇంటితాళాలు పగలగొట్టి ఉండటం గమనించాడు. వెంటనే తల్లికి సమాచారం అందించగా లోనికి వెళ్లి చూడటంతో ఇంట్లో ఉన్న బీరువాలో వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువలో దాచిఉంచిన మూడుతులాల బంగారం, 20 తులాల వెండి, కొంతనగదు కనబడలేదు. అదేవిధంగా గ్రామంలోనే మామిడిపల్లితిరుపతి ఇంట్లో కూడా ఎవ్వరూలేని సమయంలో తాళాలు పగలగొట్టి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, పక్కనేఉన్న మామిడిపల్లి అంజవ్వ ఇంటితాళాలు పగల గొట్టి రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, క్లూస్‌టీం పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రేకులపల్లిలో చోరీ..

బీర్‌పూర్: మండలంలోని రేకుపల్లి గ్రామానికి చెందిన సూరారపు గంగయ్య అనే వృద్ధుడి ఇంట్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్య ఇంట్లో తెల్లవారుజామున మూడుగంటల సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంటి వెనుకాల ఉన్న తలుపులను పగులగొట్టి ఇంట్లో ప్రవేశించారు. గంగయ్యభార్య మెడలోని ఆభరణాలు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా గంగయ్య ప్రతిఘటించడంతో దొంగలు వారు తెచ్చుకున్న పదునైన ఆయుధాలతో గంగయ్య తొడపై గాయపర్చారు. గంగయ్య భార్య దగ్గర ఉన్న తులం కుత్తికట్టు, ఒక గ్రాము ముక్కుపుడక, 40తులాల వెండికడియాలు, సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కుని ఇంటి వెనకాల నుంచి పారిపోయారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తులు నల్లని దుస్తులు ధరించి బూట్లువేసుకొనిఉన్నారని గంగయ్య తెలిపాడు. సంఘటన వివరాలు తెలుసుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజు పోలీసు సిబ్బందితో పోలీస్ డాగ్‌స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

బండి సంజయ్‌పై పోస్టుపెట్టిన బీఆర్ఎస్ నాయకుడి విచారణ

● 35(3) బీఎన్ఎస్ కింద నోటీసు
● వేధింపులకు గురి చేస్తున్నారన్న హరీష్‌రెడ్డి

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కుటుంబ సభ్యులపై ట్విట్టర్‌లో దూషిస్తూ పోస్టుపెట్టిన కేసులో రామగుండం బీఆర్ఎస్ నాయకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డికి బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు 35(3) బీఎన్ఎస్ కింద నోటీసు జారీ చేశారు. దీంతో బుధవారం అయన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. బండి సంజయ్‌ని ఉద్దేశించి ముఖ్యమంత్రి, బండి సంజయ్ ఇద్దరు ఉన్న ఫొటోను పోస్టు చేస్తూ కించపరిచే విధంగా పోస్టు పెట్టారని గోదావరిఖనికి చెందిన బీజేపీ నాయకుడు కోమళ్ల మహేష్ 2024అక్టోబర్ 24న గోదావరిఖని ఏసీపీకి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు బుధవారం నోటీసు జారీచేశారు. ఈసందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులపై కక్షపూరితంగా కేసులు నమోదు చేస్తున్నారని, సోషల్ మీడియా కేసులు నిలువవని తెలిసి కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తనపై ఇప్పటికే 10 కేసులు పెట్టారన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

● ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
● తులం పావు బంగారం, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో దోపిడీకి పాల్పడిన ఎనిమిదిమంది సభ్యులు గల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద తులం పావు బంగారం, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది స్మార్ట్ ఫోన్లు, లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి పాల్పడిన జగిత్యాలరూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన తరాల శ్రీకాంత్ అలియాస్ బండి శ్రీకాంత్, చెట్ల మహేశ్, జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడకు చెందిన పాలకుర్తిరాజు, విద్యానగర్ కాలనీకి చెందిన ఉల్లెంగుల సతీష్, పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన బడుసు మురళీ, సారంగపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఏలేటి మోహన్ రెడ్డి, రేచపల్లి గ్రామానికి చెందిన అన్నారపు రఘు, బండి మధును పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికిచెందిన ఇందూరి శంకరయ్య ఈనెల22వ తేదీన మధ్యాహ్నం గ్రామంనుంచి జగిత్యాలకు సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని హనుమాన్‌వాడలో గల బీరయ్యగుడి వద్దకు రాగానే అకస్మాత్తుగా బండి శ్రీకాంత్, పాలకుర్తి రాజు, చెట్ల మల్లేశం అను ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. శంకరయ్యను సమీపంలోని పాలకుర్తి రాజు ఇంట్లోకి బలవంతంగా లాక్కొని వెళ్లి, కొట్టి బెదిరించి అతని వద్ద ఉన్న తులం పావు బంగారం దోపిడీ చేశారు. బండి శ్రీకాంత్ అను వ్యక్తి భయభ్రాంతులకు గురిచేసి శంకరయ్య ఫోన్ ద్వారా ఒకలక్ష రూపాయలు ఫోన్‌పే చేయించుకున్నాడు. తర్వాత బండి శ్రీకాంత్, చెట్ల మల్లేశం సమాచారం ఇవ్వడంతో మరో ఇద్దరు వ్యక్తులు ఉల్లెంగుల సతీష్, బడుసు మురళి కలిసి టీఎస్02ఈక్యూ 3666 నంబరుగల కారులో బలవంతంగా శంకరయ్యను సారంగాపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కొట్టారు. శంకరయ్యను ఇంకా డబ్బులు కావాలని.. ఇవ్వకుంటే చంపుతామని కత్తితో బెదిరించారు. తరువాత బండి శ్రీకాంత్ సెల్‌ఫోన్ ద్వారా ఏలేటి మోహన్‌రెడ్డి అనేవ్యక్తికి సమాచారం అందించి అక్కడికి పిలిపించాడు. జరిగిన విషయం చెప్పి వచ్చిన డబ్బులు అందరం పంచుకుందామని తెలిపాడు. ఏలేటి మోహన్ రెడ్డి అనే వ్యక్తి అన్నారపు రఘు, బండి మధును పిలిచి విషయం చెప్పగా వారు కూడా ఒప్పుకుని తర్వాత టీఎస్18హెచ్1246 నంబరుగల ఒక ద్విచక్రవాహనంపై కల్లెడ గ్రామంలోని ఇంటికి శంకరయ్యను తీసుకెళ్లారు. ఇంకా డబ్బు, బంగారం కావాలని శంకరయ్యను బెదిరించారు. దీంతో శంకరయ్య భయానికి గురయి ఇంట్లో తన తల్లి మీద గల బంగారు పుస్తెలతాడు తీసుకుని నిందితులకు ఇవ్వడానికి ప్రయత్నించాడు. కాగా సదరు బంగారు పుస్తెల తాడును తీసుకోకుండా, అది అమ్మి డబ్బులు తేవాలని బెదిరింపులకు గురిచేశారు. కల్లెడ గ్రామం నుంచి జగిత్యాలకు నిందితులు శంకరయ్యను ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకుని తీసుకొని వచ్చారు. పట్టణంలోని క్లాక్‌టవర్ దగ్గర గల బాలాజీ జువేల్లర్స్ దుకాణంలో బంగారు పుస్తెల తాడును విక్రయించి డబ్బులు తీసుకుంటుండగా శంకరయ్యకు బావ అయిన తుమ్మనపల్లి రమేష్ అక్కడకు అకస్మాత్తుగా వచ్చి అడ్డుకున్నాడు. వెంటనే బావ తుమ్మనపల్లి రమేష్ సహకారంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శంకరయ్య ఫిర్యాదు చేశారు. జగిత్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 23వ తేదీన సంఘటనలో నిందితులైన ఎనిమిది మంది జగిత్యాల పట్టణంలో టీఎస్ 21 ఎఫ్ 0252 నంబరు గల కారులో కూర్చుని దోపిడీచేసిన డబ్బులు పంచుకుందామని మాట్లాడుకుంటుండగా పోలీసులు నిందితులను పట్టుకున్నారు. దోపిడీదొంగల ముఠాను పట్టుకోవ డంలో కృషిచేసిన డీఎస్పీ రఘుచందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, రూరల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, రూరల్ ఎస్ఐ సధాకర్, ఎస్ఐ కుమారస్వామి, మహిళా ఎస్ఐ సుప్రియ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి రివార్డును అందజేశారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన

వేములవాడ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాలింగార్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని అర్చకులు ఉదయం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ అద్దాల మంటపంలో అర్చకుల వేదమంత్రాల మధ్య మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఈవో రాధాబాయితోపాటు భక్తులు హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.


దీపాలు వెలిగిస్తున్న ఈవో, భక్తులు

బడి బ్యాగులు భారం కావొద్దు

● గట్టుబూత్కుర్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి

గంగాధర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బడి బ్యాగులు భారం కావొద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర మండలం గట్టుబూత్కుర్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు పది కిలోలు ఉండటంతో ఎంఈవో ప్రభాకర్‌రావు ప్రత్యేక చొరవ చూపి మూడు కిలోలు ఉండేలా అందించడం అభినందనీయమన్నారు. ఈవిషయం తెలుసుకుని పాఠశాలలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. బడి బ్యాగు బరువు తగ్గించడంతో ఈ విషయాన్ని రాష్ట్ర ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలస్‌తో ఫోన్‌లో మాట్లాడి గంగాధర ఎంఈవో ప్రభాకర్ రావు పనితీరును వివరించారు. గంగాధర మండలం గట్టుబూత్కుర్‌లో అనుసరిస్తున్న మూడుకిలోల విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బడిబ్యాగు మూడుకిలోలు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్న ఎంఈవో ప్రభాకర్‌రావును ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.


బ్యాగు బరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సబ్బితం జలపాతం

అభివృద్ధికి రూ.6 కోట్లు

● పర్యాటక ప్రాంతంగా మారనున్న గట్టు సింగారం


సబ్బితం జలపాతం(ఫైల్)

పెద్దపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు.. చిన్నపాటి చినుకులకే గట్టు సింగారం జలపాతం జల ధారలతో సవ్వడి చేస్తుంది. జాలువారే జలపాత ధారల కింద తడిసి ముద్దవ్వాలని ఎవరికైనా అనిపిస్తుంది. ఈ జలపాతం పర్యాటకులను వర్షాకాలంలోనే కనువిందు చేస్తుంటుంది. జిల్లా వాసులే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి ఇక్కడికి పర్యాటకులు ప్రతి ఏటా వస్తుంటారు. ఇక్కడ సరైన వసతులు లేక, రక్షణ చర్యలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సబ్బితం జలపాతాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన గెలుపొందిన తర్వాత అధికారులతో కలిసి జలపాతాన్ని సందర్శించారు. ఆ మేరకు సంబంధిత అధికారులు 12 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ ప్రతిపాదనలు ఎమ్మెల్యే ప్రభుత్వానికి సమర్పించారు. ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ టూరిజం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ఎందరో ప్రజా ప్రతినిధులు సబ్బితం జలపాతాన్ని సందర్శించి దానిని అభివృద్ధి చేస్తామని చెప్పినా నెరవేర్చలేదన్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. సబ్బితం జలపాతం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, సహకరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

● ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు
● రూ. 2.54 కోట్లతో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ సామగ్రి పంపిణీ
● గ్రామైక్య సంఘాలకు లబ్ది


పంపిణీకి సిద్ధంగా ఉన్న స్టీల్ బ్యాంకులు

పర్యావరణ పరిరక్షణకు స్టీల్ బ్యాంకులు

సైదాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు స్టీల్‌బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2.54 కోట్ల రూపాయల వ్యయంతో స్టీల్ సామగ్రిని మహిళా సంఘాలకు పంపిణీ చేస్తున్నారు. ఈనెల 17న హుస్నాబాద్ నియోజక వర్గంలోని కోహెడ మండలంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతల మీదుగా స్టీల్ బ్యాంకుల కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. 19న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి సైదాపూర్ మండలంలోని ఆరు గ్రామైక్య సంఘాలకు స్టీల్ బ్యాంకులను అందజేశారు. మిగత సంఘాలకు త్వరలోనే అందజేస్తామన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామైక్య సంఘాలకు వీటిని అప్పగిస్తున్నారు.

● మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు

స్టీల్ బ్యాంక్‌ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పచెబుతున్నారు. వారు నామమాత్రం రుసుముతో గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించే వారికి సామగ్రి అందించనున్నారు. ప్రతీ గ్రామైక్య సంఘానికి ఒక స్టీల్ బ్యాంకు మంత్రి పంపిణీ చేస్తున్నారు. స్టీల్ బ్యాంకులో టిఫిన్ లంచ్ ప్లేట్లు, బౌల్స్, వాటర్, టీ గ్లాసులు, డిష్‌లు, బకెట్లు, చేసిన్లు, జగ్గులు, చెంచాలతో పాటు వంట సామాగ్రి గిన్నెలు ఉంటాయి. ఫంక్షన్‌కు ఉపయోగపడే అన్ని వస్తువులను ఈ స్టీల్ బ్యాంకులో ఉంచారు. స్టీల్ బ్యాంకుల పంపిణీతో సైదాపూర్ మండలంలో 35 గ్రామైక్య సంఘాలకు లబ్ధి చేకూరనుంది. ఈ స్టీల్ బ్యాంకులు కిరాయికి ఇచ్చి ఆ వచ్చిన ఆదాయంతో సంఘాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు.


సైదాపూర్‌లో మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకులు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

● హోటళ్లకు స్టీల్ గ్లాసుల అందజేత

ఇప్పటికే మంత్రి నియోజక వర్గంలో హోటల్ యజమానులకు స్టీల్ టీ గ్లాసులను పంపిణీ చేశారు. ఇక నుంచి హోటళ్లలో పేపర్ గ్లాసులు గాని, ప్లాస్టిక్ గ్లాసులు గానీ వడవద్దని, స్టీల్ గ్లాసుల్లో టీ ఇవ్వాలని సూచించారు. ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరుతున్నారు.

ఆలయాల్లో శ్రావణమాసం ఉత్సవాలు నిర్వహించాలి

● సహాయ కమిషనర్ నాయిని సుప్రియ

కరీంనగర్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని ఆలయాల్లో శ్రావణమాసోత్సవాలు నిర్వహించాలని దేవాదాయ శాఖ సహాయకమిషనర్ నాయిని సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. అస్సెస్సబుల్, డీడీఎన్ ఆలయాల నిర్వహణ సమయం కంటే అరగంట ముందే తెరవాలని సూచించారు. ప్రత్యేక రోజుల్లో ఆలయాల స్థితిని బట్టి ప్రసాద వితరణ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా పెద్దపల్లి జగిత్యాల జిల్లాలకు ఇచ్చిన లక్ష్యం పూర్తయ్యిందని, కరీంనగర్‌లో కొన్ని ఆలయాల్లో మొక్కలు నాటామని పేర్కొన్నారు. మిగతా ఆలయాల్లో మొక్కలు నాటేందుకు ఆర్థిక స్తోమత, సిబ్బంది లేనందున మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు మొక్కలు నాటే విషయంలో లేఖలు రాశామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వ్యాపారిని బెదిరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని వ్యాపారులకు ఫోన్లు చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. లక్ష్మీనగర్‌లో పని చేసే ఒక హమాలీ కార్మికుడు ఫోన్లు చేసి రూ.10 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించినట్టు పోలీసులు గుర్తించారు. అతన్ని విచారించినట్టు తెలుస్తోంది.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

రుద్రంగి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపైన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలకేంద్రానికి చెందిన సిర్రం వెంకటి (50) మంగళవారం జగిత్యాల జిల్లాలోని తమ బంధువుల ఇంటికి ఓ యువకుడితో కలిసి బైక్‌పైవెళ్లి తిరిగి రాత్రి రుద్రంగికి వచ్చారు. అయితే బుధవారం ఉదయం రుద్రంగి శివారులోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని నందివాగు వద్ద వెంకటి మృతదేహంపడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంకటిమృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో సీఐ వేంకటేశ్వర్లు వారితో మాట్లాడిసర్ది చెప్పడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్లఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య కొమురవ్వ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ఇళ్లపై తెగిపడిన విద్యుత్ తీగలు

● తప్పిన పెను ప్రమాదం

గొల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్రావుపేటలో బుధవారం భారీవర్షానికి ఎల్టీ విద్యుత్‌తీగలు తెగిఇళ్లపైపడ్డాయి. త్రుటిలో పెనుప్రమాదం తప్పడంతో కాలనీవాసులతోపాటు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఎడతెరిపి వర్షం ధాటికి ఎల్టీ విద్యుత్‌తీగలు తెగి ఇళ్లపైపడ్డాయి. స్థానికులు అప్రమత్తమై ఇళ్లలోంచి బయటికి పరుగులుతీసి ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారంఅందించారు. సిబ్బంది సకాలంలో స్పందించి విద్యుత్‌సరఫరాను నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ట్రాన్స్‌కోసిబ్బంది విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించారు. ఇళ్ల పైనుంచి ఎల్టీవిద్యుత్ తీగలతో ప్రమాదం పొంచిఉందని, లైన్‌ను తొలగించాలని గ్రామస్థులు కోరారు.

అంజన్న హుండీల ఆదాయం రూ.1.10కోట్లు

మల్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,10,03,402నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. 53 రోజులకు గాను ఆలయంలోని 12 హుండీలను విప్పి బుధవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 61 విదేశి కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో లభించిన మిశ్రమ బంగారం, వెండిని సీల్‌చేసి హుండీలలోనే వేసినట్లు తెలిపారు. స్థానాచార్యులు కపీందర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహరనాథ్, అధికారులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పోలీసులు పాల్గొన్నారు. హుండీ కౌంటింగ్ పర్యవేక్షణకు ఏసీ కార్యాలయం నుంచి రాజమోగిలి హాజరయ్యారు.

● తలనీలాల టెండర్ రద్దు..

కొండగట్టులో గురువారం నిర్వహించ తలపెట్టిన తలనీలాల టెండర్ రద్దు చేసినట్లు ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సేకరించి నిల్వ చేసిన తలనీలాలకు దేవస్థానం అధికారులు ఈ నెల 18న టెండర్లకు ఏర్పాట్లు చేయగా 13 కాంట్రాక్ట్ సంస్థలు హాజరయ్యాయి. అయితే అధికారులు 24కు వాయిదా వేశారు. తాజాగా గురువారం నాటి టెండర్లు రద్దు చేసి మళ్లీ టెండర్ ప్రకటన జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.


డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

● అంజన్నను దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సతీసమేతంగా బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన విప్‌కు దేవస్థానం అధికారులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విప్ దంపతులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. ఆలయ అధికారులు, నాయకులు విప్ వెంట ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు జగిత్యాల విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాదం మహేందర్, గువ్వ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, 26, 27వతేదీల్లో షేక్‌పేట్ మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. జిల్లాకు చెందిన దుగ్యాల రాఘవ్‌రావు, పాదం హర్షిత్‌పటేల్, స్వరాలి, మోక్షత, విద్యాధిప్, సాయి, అక్షయ్ వర్ధన్, రిశ్వంత్, శశాంక్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు సాగర్, అరుణ్, మహిపాల్, నరేష్, కోచ్‌లు వంశీ కృష్ణ, నవీన్ అభినందించారు.


బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జగిత్యాల విద్యార్థులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ధర్మపురి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ (బాలికల) విద్యార్థి ముస్కువిశాల్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువతున్న విశాల్ తెలంగాణ అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో 16సంవత్స రాల విభాగంలో 600మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించాడు. ఆగస్టు3న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి విశాల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కొలిచాల శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ అటుకుల స్వప్న, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థి విశాలుకు హెచ్ఎం శ్రీనివాస్ స్పైక్ షూ అందించారు.


పోటీలకు ఎంపికైన విశాల్

ఎమర్జెన్సీ పోరాటయోధులకు త్వరలోనే తీపి కబురు

● భారత్ సురక్షాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన యోధులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే తీపికబురు అందించనుందని భారత సురక్షాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ యాదవ్ తెలిపారు. భారత్ సురక్షా సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన సత్యాగ్రహులను స్వాతంత్ర్య సమరయోధులుగా కేంద్రప్రభుత్వం త్వరలో పెన్షన్ విధానం అమలుచేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు భారత ప్రభుత్వం కేబినేట్‌లో తీర్మానం చేసిందని, త్వరలోనే స్వాతంత్ర్య సమరయోధులను ఏ విధంగా గుర్తిస్తున్నారో అదే విధంగా ఎమర్జెన్సీ యోధులను కూడా గుర్తిస్తారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు అశోక్ రెడ్డి, సత్యప్రకాష్, దర్శన్, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, పుప్పాల సత్యనారాయణ, చిట్ల గంగాధర్‌తో పాటు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాసంఘ బాధ్యులు రాష్ట్ర నాయకత్వాన్ని ఘనంగా సన్మానించారు.


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

ఆధ్యాత్మిక భజనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు

● 10జిల్లాలకు చెందిన 1000మంది కళాకారులు.. 10 గంటల ప్రదర్శన


మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళాభారతిలో బుధవారం ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్, కళారవళి సోషియోకల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక భజన ప్రదర్శనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు దక్కింది. ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 1000 మంది కళాకారులు 10 గంటలపాటు నిర్విరామంగా భజన చేసి రికార్డు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ ఇండియా ప్రతినిధి బింగి నరేందర్‌గౌడ్, డాక్టర్ వేణుకుమార్ రికార్డులో పేరు నమోదైనట్లు ప్రకటించి ధృవ పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కళాకారులకు రికార్డు ప్రశంసపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్ ఫౌండర్ సల్వాజి ప్రవీణ్, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుదాసు గోపాల్ రావు, రఘుకుల తిలక పాట సృష్టికర్త కొండల స్వామి, బోగ శ్రీనివాస్, రవీందర్, జీఎల్ నామ్‌దేవ్, ఏపీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.76 లక్షల విలువైన గుట్కా పట్టివేత

● 13.17 లక్షల నగదు సీజ్
● పోలీసుల అదుపులో 11 మంది

కరీంనగర్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఒక ముఠా కరీంనగర్, గోదావరిఖని ప్రాంతాలకు మహారాష్ట్రలోని బీదర్ నుంచి నిషేధిత గుట్కాను తరలిస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా స్థానికంగా వ్యాపారులకు సరఫరా చేస్తోంది. దీనిపై నిఘాపెట్టిన కరీంనగర్ టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు రూ.76లక్షల విలువైనగుట్కాతోపాటు 11మందిని పకడ్బందీగా పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ బిల్లకోటేశ్వర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ తీగల వంతెనవద్ద పోలీసులు బుధవారం ఉదయం గూడ్స్‌వ్యాన్, మినీ ట్రక్‌లను సోదాచేశారు. మహారాష్ట్రలోని బీదర్ నుంచి కరీంనగర్‌కు రవాణా అవుతున్న నిషేధిత గుట్కాను, ముఠాను పట్టుకున్నారు. ముఠాకు చెందిన వారిలో గోదావరిఖనికి చెందిన నలుగురు, కరీంనగర్‌కు చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈకేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. రెండు వాహనాలతోపాటు 304 బ్యాగ్‌లలో ఉన్న 7,60,000 గుట్కా పాకెట్లను సీజ్ చేశారు. నిందితుల వద్ద నుంచి 13,17,850 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. 13 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


పోలీసులు సీజ్ చేసిన గుట్కాలోడ్ వ్యాన్

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంపత్‌రావు

సిరిసిల్ల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పనిచేస్తున్న సంపత్‌రావు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. బుధవారం తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం(పీటీటీఏస్), ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంపత్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేటాటీఏస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దేవిడ్సన్, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మదన్, కార్యదర్శి బాలాజీ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయులకు ఘన సన్మానం

సిరిసిల్ల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ప్రజలు, ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తూ 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సిరిసిల్ల పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆడెపు మహేందర్, ఉపాధ్యక్షుడు బొడ్డు పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలోని లబ్ధిదారుడు ఆకుల పర్శరాములుకు మంజూరైన రూ.11 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. ఆపదలో సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని అన్నారు. పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, శ్రీనివాస్, బాబయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ఎల్లారెడ్డిపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా సహకార అధికారి రామకృష్ణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లతిమ్మాపూర్ సింగిల్ విండో పరిధిలోని గోదాములను బుధవారం ఆయన పరిశీలించారు. నిల్వ ఉన్న యూరియా బస్తాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంటల సాగు విస్తీర్ణంపై ముందుస్తు ప్రణాళిక ప్రకారం యూరియాను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోదాముల్లో యూరియా నిల్వ ఉందన్నారు. అవసరమైన రైతులు తీసుకెళ్లాలని జిల్లా సహకార అధికారి రామకృష్ణ సూచించారు. ఆయన వెంట ఏవో రాజశేఖర్ ఉన్నారు.

కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా బొమ్మకంటి రాజయ్య బుధవారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కొండ ఆంజనేయులు, అల్వాల రాజు, ప్రధాన కార్యదర్శిగా పొన్నాల బాల్‌రెడ్డి, కోశాధికారిగా రామ భీమేశ్వర్‌లను ఎన్నుకున్నారు. సలహాదారులుగా బొమ్మకంటి రాజేశం, లింగంలు వ్యవహరించనున్నారు. కార్యవర్గ సభ్యులుగా సాగర్, దేవేందర్, పరమేశ్వర్‌రెడ్డి, నారాయణ, రాజేశం, సాయికృష్ణలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేకే మహేందర్‌రెడ్డిపై విమర్శలు సరికాదు

వీర్నపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై ఓ విలేకరి విమర్శలు చేయడం సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ తన హోదా ప్రకారం బదిలీలు చేపడుతుంటే ఆ విషయాన్ని రాజకీయం చేయడం సరికాదన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ విధులు నిర్వహించడం జరిగిందన్నారు. కేకే పైన అనవసరపు వాఖ్యలు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తిరుపతి యాదవ్, ఏఎంసీ డైరెక్టర్లు మదన్, శ్రీనివాస్ సీనియర్ నాయకులు కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పొత్తూరు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరిక

ఇల్లంతకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జడ్పీమాజీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో జరిగిన సమావేశంలో రొండ్ల కరుణాకర్‌రెడ్డి, ఏనుగుల నవీన్ తదితరులు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మట్లాడుతు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హమీలు ఏఒక్కటి అర్హులైన నిరుపేదలకు అందడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలబడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పట్నం అశ్విని శ్రీనివాస్, నాయకులు కదురు శేఖర్, ఆకుల తిరుపతి, పోకల రాజేశం, పట్నం స్వామి, పట్నం మహేందర్, బండారి మహేష్, గుంటి మధు, సతీష్, నాగరాజు, శ్రీకాంత్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న పర్శ హన్మండ్లు

గంభీరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్-న్యూఢిల్లీ వారు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ వైజ్ఞానిక ప్రదర్శనలో గంభీరావుపేట మండలం దమ్మన్నపేట హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చడం అభినందనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిది పర్శ హన్మండ్లు పేర్కొన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులకు పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, హన్మండ్లు రూ.5వేల నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, ఇంచార్జీ హెచ్‌ఎం బోయన్నగారి నారాయణ, సైన్స్ టీచర్ సంపత్‌కుమార్, నాయకులు భూమరాజం, భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

'గిఫ్ట్ ఏ స్మైల్'లో ల్యాప్‌టాప్ అందజేత

ముస్తాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కొండని అశిష్‌కు మాజీ మంత్రి కేటీఆర్ చేతులు మీదుగా హైదరాబాద్‌లోని నాగారంనకు చెందిన సాయినాథ్‌గౌడ్ ల్యాప్‌టాప్ అందించారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నందినగర్‌లో కేటీఆర్‌ను కలిసి ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. ఇంజనీరింగ్ చదువుతున్న కొండని అశిష్‌కు సాయినాథ్‌గౌడ్ ల్యాప్‌టాప్‌ను సమకూర్చగా సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు సహకారంతో గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా కేటీఆర్ చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈకార్యక్రరమంలో జితేందర్‌రెడ్డి తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

రుద్రంగి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దాసరి భూమేష్ అనే యువకుడు 15 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు భూమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భూమేష్‌ది నిరుపేద కుటుంబం కావడం ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆతని కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఇందిరా చౌక్‌లోని శ్రీసర్వజన గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.37 ఆర్థిక సహాయం, అలాగే రుద్రంగికి చెందిన ఎన్ఆర్ఐ బొల్లి కూమార్ రూ.35వేల ఆర్థిక సహాయం అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, బొల్లి దేవేందర్, పిల్లమారపు ప్రవీణ్, కాసోజీ గణేష్, అట్టపల్లి మల్లేశం, పులి రాజేష్, బాసని రాజు, కాసోజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

బోయినపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్తే లంచం ఇస్తేనే ఎదుటివారిపై కేసు నమోదు చేస్తామని పోలీసులు వేధించిన ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని మండలంలోని కొరెం గ్రామానికి చెందిన క్యాతం తిరుపతిరెడ్డి, అనురాధ దంపతులు తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపించి కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

ఆకతాయిలకు అడ్డాగా బస్తీ దవాఖాన

- అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం.. - మందుబాబుల ఆగడాలు.. - పట్టించుకోని అధికారులు



సిరిసిల్ల రాజీవ్‌నగర్‌లోని బస్తీ దవాఖాన



బస్తీ దవాఖానలో ధ్వంసమైన అద్దాలు

సిరిసిల్ల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో కార్మికులకు వైద్యం అందించేందుకు ఏర్పాటుచేసిన బస్తీ దవాఖాన ఆకతాయిలకు అడాగా మారింది. నిత్యం పరిసరాల్లో మద్యం సేవిస్తూ దవాఖానకు ఏర్పాటుచేసిన అద్దాలతోపాటు ఫర్నిచర్‌లను అకతాయిలు ధ్వంసం చేసినా ఎవరు పట్టించుకోవడం లేదు. రాజీవ్‌నగర్‌లోని కార్మిక కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన బస్తీ దవాఖాన మందుబాబులకు అడ్డాగా మారింది. దవాఖాన చుట్టూ ఉన్న రోడ్డులో మందుబాబులు తాగిపడేసిన ఖాళీ సీసాలతో దవాఖానకు వచ్చే రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే వారే లేరనే విమర్శలు ఉన్నాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన పల్లెప్రగతి భవనాన్ని నిర్మించగా దాన్ని మున్సిపల్ అధికారులు బస్తీ దవాఖానగా మార్చారు. డాక్టర్‌తో పాటు వైద్యసిబ్బందిని ఏర్పాటు చేసి రాజీవ్‌నగర్‌లోని కార్మిక కుంటుంబాలకు వైద్యం అందిస్తున్నారు. అయితే బస్తీ దవాఖాన చుట్టూ ఉన్న రోడ్డును చదును చేయడంతో ఆ రోడ్డు మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. గ్రామంలోని ప్రధాన రోడ్డులో ఉన్న బెల్ట్‌షాపుల్లో మద్యం కొనుగోలు చేసిన మద్యంప్రియులు బస్తీ దవాఖాన రోడ్డులో మద్యం తాగుతూ అక్కడే ఖాళీ సీసాలను అక్కడే పగులగొట్టడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మద్యంమత్తులో కొందరు ఆకతాయిలు దవాఖాన అద్దాలను, ఫర్నిచర్‌తోపాటు వస్తువులను ధ్వంసం చేశారని సిబ్బంది తెలిపారు. దీనిపై దవాఖాన సిబ్బందితోపాటు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపులను మూసివేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బస్తీ దవాఖాన చుట్టూ మద్యం సీసాలు

- ఒగ్గు అరవింద్, రాజీవ్‌నగర్



సిరిసిల్ల పట్టణ శివారులోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లోని కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం సేవలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన బస్తీ దవాఖాన మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. రాత్రిపూట మద్యంతాగి సీసాలను అక్కడే వదిలివేయడంతోపాటు పగుల గొట్టడంతో రోగులతోపాటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ

(5వ పేజీ తరువాయి)

అన్నపూర్ణ ప్రాజెక్టులో 1.22 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

జిల్లాలో 1,68,180 ఎకరాల్లో పంటల సాగు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43,783 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు నిమగ్నమయ్యారు. వరి సాగు లక్షా 84 వేల 860 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, పెసర 79ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేశారు. జిల్లాలో ఇప్పటివరకు 1,68,180ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 1.21లక్షల ఎకరాలు నాట్లు వేశారు. విత్తన వెదజల్లే పద్ధతిలో 50 ఎకరాలు సాగు చేశారు. పత్తి 43,320 ఎకరాలు, మొక్కజొన్న 2,903 ఎకరాలు, కందులు 522 ఎకరాలు, పెసర 18 ఎకరాలు, ఇతర పంటలు 56 ఎకరాలో వేశారు. వర్షాలు లేక ఆందోళన చెందుతున్న పత్తి రైతులకు ఊరట లభించింది. వరినాట్లు జోరందుకున్నాయి.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

ఇల్లంతకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో గురువారం బీఆర్ఎస్ సమావేశం జరుగుతుందని మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు పాల్గొనాలని కోరారు.

'మహాలక్ష్మి' మహిళలకు ఎంతో ఉపయోగం

- మూడు కోట్ల ఉచిత బస్ టికెట్లపై ప్రయాణాలు - రూ.110 కోట్లు ఆదా - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి):మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగకరంగా ఉందని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం మొట్టమొదటిసారిగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్నదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల టికెట్లపై ఉచిత బస్ ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్న పలువురు మహిళలను కలెక్టర్, డీఎంలు, అధికారులు సన్మానించారు.మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం, మహిళా సాధికారత మొదలైన అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో బస్సులు నిర్వహించే సంస్థలు లేవని గుర్తుచేశారు. తెలంగాణ, కర్ణాటకలో మాత్రమే మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని అందిస్తున్నారని వెల్లడించారు.జిల్లాలోని మహిళలు దాదాపు 20 నెలల్లో మూడు కోట్ల ఉచిత టికెట్లపై ప్రయాణం చేశారని వెల్లడించారు. దీంతో వారికి రూ 110 కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆదా అవుతున్న డబ్బులను పిల్లల ఆరోగ్యం, ఉన్నత చదువులు, పొదుపు ఇతర మార్గాల్లో పెట్టాలని సూచించారు. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఆర్టీసీ డీఎంలు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న స్థలాన్ని మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు మహిళలు రాష్ట్రంలో 200 కోట్ల ఉచిత టికెట్లతో ప్రయాణం చేశారని, వాటి విలువ రూ 6680 కోట్లు ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ ప్రకాశరావు, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కోనరావుపేట మండల కేంద్రంలో కూలిన ఇంటి వద్ద మరియ

కోనరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన పులి మరియ ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయురాలైంది. కోనరావుపేట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇల్లు కూలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉంది. రాత్రిపూట వేరే ఇంటిలో పడుకోవడంతో ప్రమాదం తప్పింది. ఒంటరిగా ఉంటున్న మరియను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని దోసలగూడెంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి దాసరి యాదగిరి ఇల్లు కూలిపోయింది. ఇంట్లో వాళ్లు పనికి వెళ్లిన సమయంలో ఇల్లు కూలడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటనతో ఇంట్లో వంట సామాను మట్టిలో కలిసిపోవడంతో పాటు ఇతర వస్తువులు దెబ్బతిన్నాయి. యాదగిరి కుటుంబానికి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించి, ఆదుకోవాలని పలువురు కోరారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలో బుధవారం భారీవర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, పదిర, హరిదాస్‌నగర్, తదితర గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య ఉన్న మానేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లోని వాగు, ఒర్రెలు ప్రవహిస్తున్నాయి.

విద్యార్థులతో పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం

సిరిసిల్ల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పోచమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో గ్రామంలో ర్యాలీ తీయడంతోపాటు పోచమ్మ ఆలయం వరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్, ఉపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, రాజమల్లు, రవి కుమార్ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు, బేడబుడగజంగాల సంఘం, గాలిపెల్లి గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. డప్పుచప్పుల్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా క్షేమంగా ఉండాలని నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, బేడబుడగ జంగాల సంఘం అధ్యక్షుడు టేకు చంద్రయ్య, సభ్యులు వెంకటేష్, సురేష్, రాములు, కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళా శక్తి' ఆత్మవిశ్వాసానికి ఒక ప్రేరణ

- రానున్న రోజుల్లో రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అండగా నిలవాలి - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకం మహిళల ఆత్మవిశ్వాసానికి ఒక ప్రేరణ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా బుధవారం శుభోదయ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాల దుకాణాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకుపోతున్నారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించారన్నారు. తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారన్నారు.గత ప్రభుత్వం మహిళా సంఘంలను పట్టించుకోలేదని చివరికి మూడు సంవత్సరాల వడ్డీని ఎగ్గొట్టినట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్‌మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని తెలిపారు. చందుర్తి మండలం రాజకీయంగా ఎంతో తోడ్పాటున అందించిందని తెలిపారు. నర్సింగాపూర్ గ్రామానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించానని దానితోపాటు నియోజకవర్గ పరిధిలో 10 సబ్ స్టేషన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ ద్వారా 84 కోట్లు, 2025-26 సంవత్సరానికి 58 కోట్లు బ్యాంకు లింకేజీ అందజేయడం జరిగిందని తెలిపారు. 4350 సంఘాలకు 5కోట్ల 72 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేశామన్నారు. మహాలక్ష్మి పేరిట మహిళల కోసం ప్రారంభించిన ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకం కింద రికార్డు స్థాయిలో 200 కోట్ల మంది ప్రయాణించారని తద్వారా 6680 మేర కోట్లు మహిళలకు ఆదా అయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో ఏపీఎం రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, నాయకులు ఇల్లంతకుంట గణేష్, గొట్టే ప్రభాకర్, పులి సత్తయ్య, మ్యాకల గణేష్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి..

- జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

చందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి ఓటరుకు తెలియజేయడం కార్యకర్తల బాధ్యత అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, నాయకులు మార్త సత్తయ్య, పోంచెట్టి రాకేష్, మొకిలె విజేందర్, పెరిక గంగారాజు, లోకోజు సతీష్, మాదవి, సాగర్, నరేష్, జీవన్ తదితరలు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో గోపాడి సురేందర్‌రావు, సిరికొండ శ్రీనివాస్, కృష్ణస్వామి, పురుషోత్తం రావు, రామచంద్రం, మోత్కు మోహన్, జింక వెంకటి, శ్రీనివాస్ రెడ్డి, రాములు, తిరుపతి, వెలిశాల రవీందర్, శంకర్, జయశ్రీ, జితేందర్ రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన కార్యశాలకు మండల కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకుడు ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు చంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, నరేశ్, పర్శరాములు, సంజీవరెడ్డి, ఆంజనేయులు, బాలగౌడ్, రాజిరెడ్డి, గణేశ్, రంజిత్, బాపురెడ్డి, కిరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ మాట్లాడారు. మాజీ అధ్యక్షుడు గంట అశోక్, ప్రధాన కార్యదర్శులు మల్లేశం, విగ్నేష్, జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, స్వామిరాజు, సత్యనారాయణ, నాగరాజుగౌడ్, నర్సింలు ఉన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



సిరిసిల్లలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు బుధవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ముందస్తుగా సెలవు ప్రకటించగా, ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతునిచ్చారు. స్థానిక గీతానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు వద్ద వామపక్ష విద్యా సంఘాల నాయకులు ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కళ్యాణ్, కార్యదర్శి మల్లారుపు ప్రశాంత్, నాయకులు జశ్వంత్, ఉస్మాన్, షాహీద్, యశ్వంత్, సిద్దు సాయి, భార్గవ్, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలో ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయకులు మనోజ్ కుమార్, రాహుల్, పవన్, శివ, విష్ణువర్ధన్, కృష్ణ, మధు, ప్రతాప్, రాకేశ్, వెంకటేశ్, రవితేల, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలంలో విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు కిరణ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు వర్షిత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట :మండలంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనీల్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండారి చందుగౌడ్, నాయకులు పున్ని పవన్, దొమ్మాటి శ్రీహరి, గుంటి రాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలో ఎస్ఎఫ్ఐ బంద్ బుధవారం విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అఖిల్, నిఖిల్, యశ్వంత్, ఉదయ్, ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించన బంద్ వేములవాడలో విజయవంతం అయ్యిందని జిల్లా కన్వీనర్ సంజన అన్నారు. పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలు బంద్ చేయించారు. కార్యక్రమంలో సామల్ల సాయిభరత్, కడారి శివ తదితరులు ఉన్నారు.

● గంభీరావుపేట : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గంభీరావుపేటలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, దీపక్, ఈశ్వర్ విద్యార్థులు ఉన్నారు.